# సాక్షి నిర్మల్

శుక్రవారం । 9 । ఫిబ్రవరి । 2024






## ప్రణాళికతోనే విజయం

పిల్లల మార్కులే సర్వస్వం కాదు. తల్లిదండ్రులు ఆత్మస్థైర్యం నింపుతూ ఉపాధ్యాయులు తగిన మార్గదర్శనం చేస్తే పరిపూర్ణంగా ఎదగ గలుగుతారు.

8లో ▶

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.1 / 19.5

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. చలి ప్రభావం చలా వరకు తగ్గుతుంది.

## న్యూస్‌రీల్

### పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

- అదనపు కలెక్టరు ఫైజాన్ అహ్మద్



సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

**లోకేశ్వరం:** గ్రామంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. మండలంలోని పోట్‌పల్లిలో సెగ్రిగేషన్‌షెడ్డు, మురికి కాలువలు, వైకుంఠధామం, నర్సరీని పరిశీలించారు. తర్వాత గ్రామపంచాయతీలు రికార్డులు తనిఖీ చేశారు. మంచినీటి ట్యాంకులను మూడురోజులకు ఒకసారి శుభ్రం చేయాలన్నారు. ఇంటింటా తడిపొడి చెత్తను సేకరించాలని సూచించారు. సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించి సేంద్రియ ఎరువు తయారు చేయాలని తెలిపారు. డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. నర్సరీలో మొక్కలను సంరక్షించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో సోలమాన్ రాజ్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

### 200 కుటుంబాలు.. ఒకే బోరు..!



బోరుకు ఏర్పాటు చేసుకున్న పైప్ కనెక్షన్లు

**భైంసాటౌన్:** ముంపు గ్రామమైన గుండెగాం నిర్వాసితులకు అధికారులు భైంసా పట్టణ శివారులోని డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయంలో తాత్కాలిక ఆవాసం కల్పించారు. దాదాపు 200 కుటుంబాలు ఇక్కడ ఆశ్రయం పొందుతున్నాయి. ఇళ్లకు నల్లా సదుపాయం లేకపోవడంతో నిర్మాణ సమయంలో వేసిన బోరు నీటినే 200 కుటుంబాలు వినియోగించుకుంటున్నాయి. అన్ని కుటుంబాలకు కలిపి ఒక్కటే మోటారు బోరు ఉండగా, అది కూడా మినీ స్టేడియం పరిధిలో ఉంది. దీంతో తాగు, ఇతర నీటి అవసరాలకు ఇబ్బందులు పడుతున్నారు. పైఅంతస్తుల్లో ఉన్నవారు నీటిని మోసుకెళ్లాల్సిన పరిస్థితి. కొందరు బోరుకు పైప్ కనెక్షన్లు ఇచ్చి నీటిని వాడుకుంటున్నారు.

### మెరుగైన ఫలితాలు సాధించాలి

- డీఐఈవో పరశురామ్‌నాయక్




ప్రాక్టికల్ పరీక్షలను పరిశీలిస్తున్న డీఐఈవో

**లోకేశ్వరం:** ఇంటర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఐఈవో పరశురామ్‌నాయక్ సూచించారు. మండల కేంద్రంలో జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ విద్యార్థులు అధ్యాపకులు నేర్పిన పాఠాలను చక్కగా నేర్చుకుని పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధ్యాపకులకు సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ తుకారాం, అధ్యాపకులు వినోద్, శ్రీనివాస్, చిన్నయ్య, విఠల్ ఉన్నారు.

### సూర్యాపేట కవియాత్రకు భైంసా కవి

**భైంసాటౌన్:** సూర్యాపేట జిల్లాలోని కోదాడలో ఈనెల 11న జరిగే రాష్ట్రస్థాయి కవియాత్రకు భైంసాకు చెందిన జాదవ్ పుండలిక్‌రావు పాటిల్ ఎంపికయ్యారు. డాక్రి సంస్థ, సిలివేరు సాహితీ కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే కవియాత్రకు భైంసా డివిజన్ నుంచి ఎన్నికవడంపై కవులు పీసర శ్రీనివాస్‌గౌడ్, బసవరాజు, రెడ్ల బాలాజీ, కదారి దశరథ్, ముజ్జి రవి ఆయన్ను అభినందించారు.

### ప్రతీ కుటుంబానికి వంద రోజుల పని



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో

**మామడ:** జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా ప్రతీ కుటుంబానికి వంద రోజుల పని కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉపాధిహామీ పనులు వేగవంతం చేయాలన్నారు. నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందించాలని తెలిపారు. సమీక్షలో ఎంపీడీవో రమేశ్, ఈజీఎస్ ఏపీవో శివాజీ, ఐకేపీ ఏపీఎం అరుణ, అధికారులు పాల్గొన్నారు.

# జనజాతర పిలుస్తోంది!

నాగోబా విగ్రహం





ముస్తాబైన నాగోబా ఆలయం



దర్బార్ ఎదుట ఏర్పాటు చేసిన ప్రభుత్వ స్టాల్స్



నైవేద్యాల వద్ద వెలిగించిన దీపాలు

- నేటి నుంచి నాగోబా జాతర
- 'మెస్రం' మహాపూజతో షురూ..
- ఇప్పటికే చేరుకున్న వంశీయులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 12న ఆలయ ఆవరణలో దర్బార్
- హాజరు కానున్న రాష్ట్ర మంత్రులు

**ఇంద్రవెల్లి:** 'గిరి'జన జాతరకు వేళయింది. రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన నాగోబా జాతర నేటి నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయం ముస్తాబైంది. ఆదివాసీల ఆరాధ్యదైవం నాగోబాకు అంగరంగ వైభవంగా మహాపూజ నిర్వహించేందుకు మెస్రం వంశీయులు సిద్ధమయ్యారు. పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి 10.30 గంటలకు పవిత్ర గంగాజలంతో నాగోబాను అభిషేకిస్తారు. అనంతరం మహాపూజతో జాతర ప్రారంభమవుతుంది. అధికారికంగా నిర్వహించే ఈ జాతర ఈ నెల 15వ తేదీ వరకు కొనసాగనుంది. మహాపూజకు కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర అధికారులు హాజరు కానున్నారు. ఈ నెల 12వ తేదీన దర్బార్ నిర్వహించనుండగా మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొంటారు.

**'మెస్రం' సంప్రదాయ పూజలివే..**

జన్నారం మండలంలోని గోదావరి హస్తిన మడుగు నుంచి సేకరించిన పవిత్ర గంగాజలంతోపాటు నాగోబా ప్రతిమలు, పూజసామగ్రితో వచ్చి మర్రిచెట్టు వద్ద మెస్రం వంశీయులు బస చేశారు. శుక్రవారం ఉదయం వీరు కేస్లాపూర్‌లోని నాగోబా మురాడి వద్దకు డోలు, పెప్రే, కాలికోమ్ వాయిద్యాల మధ్య శోభాయాత్రగా చేరుకుంటారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించనుండగా ప్రధాన్ కితకు చెందిన మెస్రం వంశీయులు సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తారు. మహాపూజకు అవసరమయ్యే సిరికొండ నుంచి తీసుకువచ్చిన మట్టి కుండలను 22 కితల మెస్రం వంశం మహిళలకు అందిస్తారు. మెస్రం మహిళలు ఈ సందర్భంగా వంశ పెద్దల ఆశీర్వాదం తీసుకుంటారు. కొత్త కుండలతో మర్రి చెట్టు వద్ద గల కోనేరు నుంచి పవిత్ర జలం తీసుకువచ్చాక నాగోబా ఆలయం పక్కనే ఉన్న పాత పుట్టను వంశ అల్లుళ్లు తొలగిస్తారు. వంశ మహిళలు, ఆడపడుచులు కొత్త పుట్టలు తయారు చేస్తారు. అనంతరం కొత్త పుట్టల మట్టితో ఉండలు చేసి నాగోబా ఆలయం పక్కనే గల సతి దేవత ఆలయంలో బౌలను తయారు చేస్తారు. ఈ పూజ శుక్రవారం సాయంత్రం వరకు కొనసాగుతుంది. అనంతరం మర్రిచెట్టు వద్ద బస చేసిన మెస్రం వంశీయులు నాగోబా ఆలయం పక్కనే గల ప్రత్యేక కట్టడం గోవడ్ వద్దకు చేరి కితల వారీగా బస చేయనున్నారు. అక్కడి నుంచే నాగోబా మహాపూజ, సంప్రదాయ పూజలు నిర్వహిస్తారు.

**ఆలయంలో మహాపూజ ఇలా..**

సంప్రదాయ పూజలు ముగించాక మెస్రం వంశీయులు పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకుని హస్తిన మడుగు నుంచి తీసుకువచ్చిన పవిత్ర గంగాజలంతో నాగోబా ఆలయం, విగ్రహానికి అభిషేకం చేస్తారు. రాత్రి 10.30 గంటలకు మహాపూజ ప్రారంభిస్తారు. ఇందులో వంశంలోని పెద్దలు మినహా ఇతరులను అనుమతించరు. మహాపూజ అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులకు మహాపూజ హారతి అందించి ఆహ్వానిస్తారు. మహాపూజతో జాతర ప్రారంభమైనట్లు మెస్రం వంశీయులు ప్రకటిస్తారు.

**గోవడ్ ముందు బేతల్ పూజలు**

మహాపూజతో పాటు సంప్రదాయ పూజలు ముగించాక మెస్రం వంశీయులు ప్రత్యేక కట్టడమైన గోవడ్ ముందు బేతల్ పూజలు నిర్వహించనున్నారు. బేతల్ పూజలో ప్రధాన్ కితకు చెందిన మెస్రం వంశీయులు, కొత్తగా బేటింగ్ అయిన కొత్త కోడళ్లు, వంశ మహిళలు కానుకలు అందిస్తారు. అనంతరం వంశం పెద్దలు వెదురు కర్ర పట్టుకుని బేతల్ నృత్యాలు చేస్తారు. బేతల్ నృత్యాలతో నాగోబా పూజలు ముగించి ఉట్నూర్ శ్యామ్‌పూర్ బుడుందేవ్ ఆలయానికి బయల్దేరి వెళ్తారు.



మర్రి చెట్టు వద్ద సంప్రదాయ వంటలు చేస్తున్న మెస్రం వంశ మహిళలు

### ముగిసిన తూమ్ పూజలు

పవిత్ర గంగాజలంతో వచ్చి మర్రిచెట్టు వద్ద బస చేసిన మెస్రం వంశీయులు గురువారం తెల్లవారుజాము వరకు మరణించిన 104 మంది పెద్దల పేర్లతో తూమ్ (కర్మకాండ) పూజలు నిర్వహించారు. ఈ పూజల తర్వాత మరణించిన వంశ పెద్దలను నాగోబా సన్నిధికి తీసుకువచ్చినట్లు భావించారు. మర్రిచెట్టు వద్ద 22 కితల వారీగా సంప్రదాయ వంటలు కొనసాగుతున్నాయి.



తూమ్‌పూజలో బియ్యం సేకరిస్తున్న వంశీయులు

### పూర్తయిన ఏర్పాట్లు

నాగోబా జాతర నిర్వహణకు వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నాగోబా దర్శనానికి వచ్చే భక్తులు, నాగోబా సంప్రదాయ పూజలకు వచ్చిన మెస్రం వంశీయుల సౌకర్యార్థం ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో తాగు నీరు, మరుగుదొడ్లు, స్నానపు గదుల ఏర్పాటు పనులు పూర్తి చేశారు. పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో కేస్లాపూర్ గ్రామం నుంచి నాగోబా ఆలయం వరకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆయా ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో జిల్లా అధికారులు అప్పగించిన పనులు పూర్తి చేశారు. దర్బార్ హాల్ పక్కనే ప్రభుత్వ స్టాల్స్ ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి లోటు రాకుండా చూస్తామని అధికారులు తెలిపారు.

### కొత్త కోడళ్లకు బేటింగ్

మహాపూజ అనంతరం రాత్రి ఒంటిగంట తర్వాత గోవడ్ నుంచి సంప్రదాయ వాయిద్యాలతో నాగోబా ఆలయానికి చేరుకుని బేటింగ్ (నాగోబా దేవత పరిచయం) ప్రారంభిస్తారు. నాగోబా సన్నిధికి కొత్త కోడళ్లు తెల్లటి దుస్తులు ధరించి వస్తారు. బేటింగ్‌కు వచ్చిన కోడళ్లతో నాగోబా ఆలయం పక్కనే ఉన్న సతి దేవత ఆలయంతో ప్రత్యేక పూజలు చేయిస్తారు. అనంతరం కొత్త కోడళ్లు వంశ పెద్దల ఆశీర్వాదం తీసుకుంటారు. ఈ ప్రక్రియ అనంతరం కొత్త కోడళ్లు పూర్తిగా తమ వంశంలో చేరినట్లు మెస్రం పెద్దలు భావిస్తారు. ఈ ప్రక్రియ శనివారం తెల్లవారుజాము వరకు కొనసాగుతుంది.

### పెర్సపేన్ (పెద్దదేవుడు), బాన్ దేవతలకు పూజలు

మహాపూజ అనంతరం మెస్రం వంశీయులు ఆలయం వెనుక పెర్సపేన్ (పెద్ద దేవుడు), బాన్ దేవతలకు పూజలు నిర్వహించనున్నారు. వంశంలోని పురుషులు పెర్సపేన్ (పెద్ద దేవుడు)కు పూజలు చేసి నైవేద్యం సమర్పించనున్నారు. ఈ పూజల్లో వంశంలోని పురుషులు మాత్రమే పాల్గొంటారు. ఇదే సమయంలో పక్కనే మెస్రం మహిళలు, బేటింగ్ అయిన కొత్త కోడళ్లు బాన్‌దేవతకు పూజలు చేస్తారు. మర్రిచెట్టు వద్ద ఉన్న కోనేరు నుంచి పవిత్ర జలం తీసుకువచ్చి పాత బాన్ దేవతలను తొలగించి కొత్త బాన్ దేవతలను తయారు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నైవేద్యం సమర్పిస్తారు. బాన్ దేవత పూజల్లో మెస్రం వంశ మహిళలు, కొత్తగా బేటింగ్ అయిన కోడళ్లు మాత్రమే పాల్గొంటారు.

### భారీ బందోబస్తు

నాగోబా జాతర సందర్భంగా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 600మంది పోలీస్ అధికారులు, సిబ్బంది బందోబస్తులో పాల్గొంటున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 100కు పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

# ఎవరికీ దక్కొద్దని..

- పెళ్లి సంబంధం చెడగొట్టి..
- ప్రణాళిక ప్రకారమే అలేఖ్య హత్య
- ముందే ఫిర్యాదు చేసినా.. కానిస్టేబుల్ పరీక్ష రాశాడని కనికరం..
- నాడే అరెస్ట్ చేసి ఉంటే అలేఖ్య దక్కేది..



రోదిస్తున్న అలేఖ్య తల్లి గంగవ్వ



గాయపడిన జయశీల



నిందితుడు శ్రీకాంత్

**ఖానాపూర్:** తాను ప్రేమించిన యువతి తనకు దక్కడం లేదని.. మరొకరిని పెళ్లి చేసుకోకూడదని ఉన్మాదిలా మారిన ఓ యువకుడు గురువారం పట్టపగలు అందరూ చూస్తుండగానే పదునైన ఆయుధంతో నరికి చంపిన ఘటన ఖానాపూర్ పట్టణంలో జరిగింది. పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన షెట్పెల్లి గంగవ్వ – గంగారాం దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు సంతానం. పెద్ద కూతురు పదేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయింది. పెద్ద కొడుకు ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా రెండో కుమారుడు చదువుకుంటున్నాడు. కూతురు అలేఖ్య(23) ఇంటర్ పూర్తిచేసి ఇంటివద్దే ఉంటూ టైలరింగ్ శిక్షణ తీసుకుంటోంది. గతేడాది గ్రూప్–4 పరీక్ష రాసింది. అదే కాలనీకి చెందిన జూకింది సత్తవ్వ–రాజన్న దంపతుల కుమారుడు శ్రీకాంత్ డిగ్రీ పూర్తిచేశాడు. పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి సన్నద్ధమయ్యాడు. ఫలితాల్లో ఫెయిల్ అయ్యాడు. రాజన్న ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు.

**ఏడాదిగా వేధింపులు..**

ఏడాది కాలంగా శ్రీకాంత్ అలేఖ్య వెంట పడుతున్నాడు. ప్రేమించాలని, పెళ్లి చేసుకుందామని వేధిస్తున్నాడు. ఈ విషయమై అలేఖ్య తల్లిదండ్రులపైనా ఒత్తిడి చేశాడు. కానీ, అలేఖ్య, ఆమె తల్లిదండ్రులుఅంగీకరించలేదు. దీంతో కూతురును కొన్ని రోజులు బంధువుల ఇంటికి పంపించారు. ఇటీవలే స్వగ్రామానికి తీసుకువచ్చి పెళ్లి సంబంధాలు చూడడం ప్రారంభించారు. జగిత్యాల జిల్లాకు చెందిన ఓ యువకుడితో పెళ్లి నిశ్చయించారు. విషయం తెలుసుకున్న శ్రీకాంత్.. సంబంధం చెడగొట్టాడు. దీంతో అలేఖ్య తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

**కానిస్టేబుల్‌కు సిద్ధమవుతున్నానని..**

పోలీసులు శ్రీకాంత్‌ను పిలిపించారు. కేసు నమోదు చేస్తామని బెదిరించారు. అయితే శ్రీకాంత్ తాను పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ్యానికి ప్రిపేర్ అవుతున్నానని, క్షమించి వదిలేయాలని వేడుకున్నాడు. పోలీసులు కూడా శ్రీకాంత్ కెరీర్‌కు ఇబ్బంది కలగ కూడదని కేసు నమోదు చేయకుండా వదిలేశారు. ఇదే అలేఖ్యపాలిట శాపమైంది. పోలీసులకు ఫిర్యాదు చేసినందుకు శ్రీకాంత్ మరింత కక్ష పెంచుకున్నాడు. తనకు దక్కని అలేఖ్య ఎవరికీ దక్కకూడదని నిర్ణయించుకున్నాడు.

**ఉన్మాదిలా మారి..**

తాను పెళ్లంటూ చేసుకుంటే అలేఖ్యనే చేసుకుంటానని శ్రీకాంత్ ఇంట్లో తల్లితో, మిత్రులతో చెప్పేవాడు. అయితే అలేఖ్య మాత్రం శ్రీకాంత్‌ను పెళ్లి చేసుకోవడానికి సుముఖంగా లేదు. దీంతో తనకు దక్కని అలేఖ్యను చంపాలని నిర్ణయించుకున్నాడు. టైలరింగ్ శిక్షణ పొందుతున్న విషయం తెలుసుకుని గురువారం ఆమెను ఫాలో అయ్యాడు. మధ్యాహ్నం ఇంటికి వస్తుండగా అందరూ చూస్తుండగానే ఉన్మాదిలా పదునైన ఆయుధంతో దాడిచేసి చంపేశాడు. అడ్డుకోబోయిన ఆమె వదిన జయశీల, ఆమె కొడుకు రియాన్స్‌పైనా దాడి చేశాడు. అలేఖ్య అక్కడికక్కడే మృతిచెందింది.

**పరారీలో నిందితుడు..**

నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, ఖానాపూర్ సీఐ మోహన్, ఎస్సై లింబాద్రి ఘటన స్థలాన్ని పరిశీలించారు. జయశీల, రియాన్స్‌ను ఆస్పత్రికి తరలించారు. అలేఖ్య మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాత్రి పోలీసు బందోబస్తు మధ్య గ్రామంలో అలేఖ్య అంత్యక్రియలు పూర్తి చేశారు. పెళ్లి చేసి అత్తారింటికి పంపిస్తామనుకున్న కూతురును కాటికి పంపిస్తుండడంతో అలేఖ్య తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. శ్రీకాంత్‌ను కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# జిల్లాలో ఓటర్లు 7,33,717

- ఓటరు తుదిజాబితా విడుదల
- ఈసారీ ఆమెనే నిర్ణేత..



**భైంసాటౌన్:** జిల్లాలో మహిళలు సంఖ్యాపరంగానే కాకుండా ఓటరు జాబితా పరంగానూ ముందంజలోనే నిలుస్తున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటముల్లో కీలకంగా మారిన మహిళామణులు రానున్న ఎంపీ ఎన్నికల్లో సైతం నిర్ణేతలుగా మారనున్నారు. గురువారం ఎన్నికల అధికారులు ఓటరు తుదిజాబితా ప్రకటించారు. దీని ప్రకారం జిల్లాలో మొత్తం 7,33,717 మంది ఓటర్లు ఉన్నారు. మహిళలు 3,79,880 మంది, పురుషులు 3,53,786 మంది ఉన్నారు. ఇతరులు 51 మంది ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల జాబితాతో పోలిస్తే 9 వేలకు పైగా ఓటర్లు పెరిగారు. జనవరి 1,2024 నాటికి 18 ఏళ్లు నిండినవారికి ఓటు హక్కు కల్పించారు. నూతన ఓటరుగా నమోదుకు యువత అధిక సంఖ్యలోనే దరఖాస్తు చేసుకున్నారు.

### నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలిలా...

| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
| --- | --- | --- | --- | --- |
| నిర్మల్ | 1,21,070 | 1,35,057 | 20 | 2,56,147 |
| ముధోల్ | 1,23,208 | 1,30,378 | 18 | 2,53,604 |
| ఖానాపూర్ | 1,09,508 | 1,14,445 | 13 | 2,23,966 |
| మొత్తం | 3,53,786 | 3,79,880 | 51 | 7,33,717 |



### పకడ్బందీగా 'గృహలక్ష్మి' సర్వే

**లక్ష్మణచాంద:** మండలంలో కనకాపూర్‌లో కొనసాగుతున్న గృహలక్ష్మి సర్వే, ఆధార్ అనుసంధానం ప్రక్రియను విద్యుత్ శాఖ సీఈ గుప్తా గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వినియోగదారుల ఇంటికి వెళ్లి వారి మీటర్ నంబర్ ఎంటర్ చేయగానే వారు ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తు నంబర్, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్, రేషన్ నంబర్ అందులో వచ్చాయి. దీంతో వినియోగదారుల వివరాలు ఇందులోని వివరాలను సరిపోల్చుకున్నారు. ప్రతీ వినియోగదారుడు తప్పనిసరిగా ఈ వివరాలు విద్యుత్ సిబ్బంది వచ్చినప్పుడు సరిచూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ ఏడీ రంగస్వామి, ఎస్ఐఆర్‌సీ లక్ష్మీనారాయణ, జేఎల్ఎం రవితేజ పాల్గొన్నారు.

# పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎస్పీ జానకీ షర్మిల

**నిర్మల్‌టౌన్:** పోలీస్ కుటుంబాలకు నిరంతరం అండగా ఉంటామని ఎస్పీజానకీ షర్మిల తెలిపారు. ఆకస్మికంగా మరణించిన హెడ్ కానిస్టేబుల్ సలీమ్ కుటుంబానికి పోలీస్ భద్రత నుంచి మంజూరైన రూ.8 లక్షల చెక్కును ఎస్పీ క్యాంపు కార్యాలయంలో అతని కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సలీం కుటుంబ పరిస్థితుల గురించి ఎస్పీ ఆరా తీశారు. శాఖా పరంగా రావాల్సిన బెనిఫిట్లు త్వరగా అందేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో సెక్షన్ సూపరింటెండెంట్ నర్సమ్మ, పోలీస్ అధికారుల సంఘ ప్రతినిధి విరాహత్ అలీ పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

### బాల్క సుమన్‌పై ఎస్పీకి ఫిర్యాదు

**నిర్మల్‌చైన్‌గేట్:** సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై యువజన కాంగ్రెస్ నాయకులు ఎస్పీ జానకి షర్మిలకు గురువారం ఫిర్యాదు చేశారు. సుమన్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. లేనిపక్షంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేస్తామని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సబ్జా హుస్సేన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ అర్షద్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు మొహమ్మద్ నవీద్, ఎండీ.మినాజ్, సయ్యద్ తాజ్, అబ్దుల్ నవీద్ ఉన్నారు.



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## క్లుప్తంగా

### శనగ పంటపై అడవిపందుల దాడి


ధ్వంసమైన పంటను చూపిస్తున్న భూమన్న

బోథ్: మండలంలోని పార్డి కెలో రైతు మేస్రం భూమన్నకు చెందిన శనగ పంటను బుధవారం రాత్రి అడవిపందులు ధ్వంసం చేశాయి. దాదాపు ఎకరం చేనులో ఉన్న పంటను నాశనం చేసినట్లు బాధిత రైతు వాపోయాడు. నష్టపరిహారం అందించాలని కోరుతున్నాడు.

### కలప తరలిస్తున్న ఒకరి రిమాండ్


పోలీసుల అదుపులో సక్కారాం

బోథ్: మండలంలోని ధన్నూర్ బి వద్ద అక్రమంగా కలప తరలిస్తున్న నాగాపూర్ గ్రామానికి చెందిన సక్కారాంను రిమాండ్‌కు తరలించినట్లు డీఆర్‌వో ప్రమోద్ తెలిపారు. ధన్నూర్ బి గ్రామ శివారులో బుధవారం రాత్రి గస్తీ నిర్వహిస్తుండగా సక్కారాం రెండు టేకు దుంగలను తరలిస్తూ పట్టుబడ్డాడు. అతనితో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా సక్కారాంను గురువారం 14 రోజుల రిమాండ్‌కు తరలించారు. కలప విలువ రూ.9,800 ఉంటుందన్నారు. ఆయన వెంట ఎఫ్‌బీవో మహేష్, సిబ్బంది జబీర్, రామకృష్ణ, శంభు, శ్రీనివాస్ ఉన్నారు.

### బాలికపై లైంగిక దాడికి యత్నించిన ఒకరికి మూడేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: బాలికపై లైంగికదాడికి యత్నించిన ఒకరికి నిర్మల్ కోర్టు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పుచెప్పినట్లు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపారు. 2019, జూన్ 9న భైంసా పట్టణానికి చెందిన బాలిక (9) ఇంటిముందు స్నేహితులతో కలిసి ఆడుకుంటుండగా షేక్ బషీర్ అనే వ్యక్తి వారి వద్దకు వచ్చి బాలికను పక్కనే నిర్మాణంలో ఉన్న ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. బాలిక అరవడంతో చుట్టుపక్కల వారు రావడంతో అక్కడి నుంచి పారిపోయాడు. బాలిక తండ్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై విష్ణు ప్రకాష్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ విశ్వాస్‌రెడ్డి 13 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో నిందితునికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి కర్ణకుమార్ గురువారం తీర్పునిచ్చారు.



# ప్రణాళికతోనే విజయం

"పిల్లల మార్కులే సర్వస్వం కాదు. తల్లిదండ్రులు కూడా మార్కుల కోసం విద్యార్థులపై ఒత్తిడి పెంచవద్దు. అన్ని రకాల పరిస్థితులను తట్టుకునేలా తమ పిల్లల్లో తల్లిదండ్రులే ఆత్మస్థైర్యం నింపుతూ తీర్చిదిద్దాలి. ఉపాధ్యాయులు తగిన మార్గదర్శనం చేస్తే విద్యార్థులు జీవితంలో పరిపూర్ణంగా ఎదగ గలుగుతారు..."

గత సోమవారం భారత ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్థులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన 'పరీక్ష పే చర్చ' కార్యక్రమంలో అన్న మాటలివీ..

- పరీక్షల కాలం ప్రారంభం
- విద్యార్థులపై ఒత్తిడి వద్దు
- ఆత్మవిశ్వాసం కల్పించాలి
- విద్యారంగ నిపుణుల సూచన


పరీక్షలకు సన్నద్ధమవుతున్న పదోతరగతి విద్యార్థులు

నిర్మల్‌ఖిల్లా: ఈ నెల చివరివారం నుంచి ఇంటర్ పరీక్షలు మొదలుకొని వచ్చే మే, జూన్ నెలల వరకు విద్యార్థి లోకానికి పరీక్షల కాలం. ఈ సమయం అంతా టెన్త్, ఇంటర్, డిగ్రీ ఇతర ప్రవేశ పరీక్షలకు చెందిన విద్యార్థులు సర్వసాధారణంగా ఒత్తిడికి గురవుతుంటారు. అయితే ఒక క్రమబద్ధమైన ప్రణాళికతో చదివితే సరైన ఫలితాలు తెచ్చుకోవచ్చని విద్యారంగ నిపుణులు అంటున్నారు. మరోవైపు విద్యార్థులు


కేజీబీవీలో విద్యార్థులకు ప్రేరణ తరగతులు (ఫైల్)

ఆత్మవిశ్వాసం కోల్పోకుండా వారిలో పరీక్షల పట్ల భయాందోళనలు దూరం చేస్తూ ఒక చక్కని వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదేనని పేర్కొంటున్నారు.

**మొదలైన ఇంటర్ ప్రాక్టికల్స్**

జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇక ఇదేనెల చివరి వారం నుండి ఇంటర్ థియరీ పరీక్షలు కూడా మొదలుకానున్నాయి. వచ్చే మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు కూడా రాబోతున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఒక గురుతర బాధ్యత స్వీకరిస్తే ఈ పరీక్షల కాలం నుంచి సరళతరంగా గట్టెక్కించవచ్చు. పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు తీసుకురావడానికి జిల్లా విద్యాశాఖ ఇప్పటికే ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది.

**ఉపాధ్యాయుల మార్గదర్శనం అవసరం..**

పాఠశాలలో రోజులో ఎక్కువ సమయం విద్యార్థులు తమ ఉపాధ్యాయుల సమక్షంలోనే గడుపుతారు. అయితే పరీక్షల్లో విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ఉండడంతో పాటు భవిష్యత్‌లో రాణించేలా వారికి మార్గనిర్దేశం చేయాలి. నిపుణులైన ఉపాధ్యాయులచే ప్రత్యేక అవగాహన కల్పించాలి. దీంతో పాటు తల్లిదండ్రులకు కూడా విద్యార్థుల పట్ల ప్రవర్తించాల్సిన తీరును వివరించాల్సిన అవసరం ఉంది. విద్యార్థులపై తల్లిదండ్రులు ఒత్తిడి పెంచకుండా సానుకూలంగా చదివేలా ప్రోత్సహించాలి.

**చెడు ఆలోచన వీడాలి..**

కొంతమంది విద్యార్థులు పదేపదే నావల్ల కాదు.. అంటూ మొదట్లోనే అస్త్రసన్యాసం చేస్తుంటారు. పరీక్షలకు ముందే చదవడం పూర్తి కాలేదు. కాబట్టి నేను పరీక్షలను పూర్తిస్థాయిలో ఎదుర్కోలేను.. అనే ప్రతికూల ధోరణి పెంపొందించుకుంటారు. మొదట ఈ ధోరణిని విద్యార్థులు విడనాడేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలి. అవసరమైతే వ్యక్తిత్వ వికాస నిపుణుల ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేయాలి. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలి.

**పాటించాల్సినవి ఇవే...**

- ప్రతిరోజు ఉదయం 5గంటలకే నిద్ర లేచి ప్రశాంత వాతావరణంలో చదువుకోవాలి. చదవాల్సిన టాపిక్స్‌పై ప్రణాళిక బద్ధంగా కాల నిర్ణయ పట్టికను ఏర్పాటు చేసుకోవాలి.
- ప్రతి సబ్జెక్టులోని కీలక అంశాలను ఎప్పటికప్పుడు నోట్స్ రూపంలో రాసుకుంటూ ఉండాలి.
- సబ్జెక్టు అంశాన్ని బట్టి చదవడం కాకుండా విషయం పరిపూర్ణంగా ఆకలింపు చేసుకొని అర్థం చేసుకుంటూ చదవాలి.
- రోజంతా ఒకే సబ్జెక్టును చదవకుండా టైం టేబుల్ ప్రకారం సబ్జెక్టులను మార్చాలి. ఒత్తిడి తగ్గుతుంది.
- పరీక్షల సమయంలో టీవీ కంప్యూటర్ మొబైల్ ఫోన్లకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది.

**ప్రశాంత వాతావరణంలో చదవాలి...**



పరీక్షలు సమీపిస్తున్న కొద్దీ విద్యార్థులు ఆందోళన మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. ఆశించిన మార్కులు వస్తాయో రావో అన్న బెంగతో కొందరు.. ఉత్తీర్ణత సాధిస్తామో లేదా అని మరికొందరు ఆందోళనకు గురవుతుంటారు. ఫలితాల గురించిన భయం ఆందోళన విడనాడి మొదలు ప్రశాంతంగా చదువుకోవాలి.

– అడ్డిగ శ్రీనివాస్, వ్యక్తిత్వ వికాస నిపుణులు

**సాత్విక ఆహారం తీసుకోవాలి**



ప్రస్తుతం పరీక్షల సీజన్ మొదలైంది. ప్రిపరేషన్ పరీక్షలు ధ్యాసలో పడి భోజనాన్ని నిర్లక్ష్యం చేస్తుంటారు ఈ సమయంలో సరైన ఆహారం తీసుకోవడం కూడా చాలా కీలకం. ఉదయం పూట గోరువెచ్చని నీరు తాగితే శరీరం జలుబు జ్వరం వంటివి రాకుండా సమతుల్య స్థితిలో ఉంటుంది. ఇంటి ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలి. బయట తిండి జోలికి వెళ్లొద్దు.

– అల్లాడి రవికుమార్, ఆయుర్వేద నాడీ వైద్యులు, నిర్మల్

### రేపు ఉచిత వైద్య పరీక్షలు

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రీయ బాల స్వస్థ్ కార్యక్రమంలో భాగంగా శరీర పునర్నిర్మాణ శస్త్ర చికిత్స కోసం ఆకార్ ఆశ హాస్పిటల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా ప్రసూతి ఆసుపత్రిలోని డైస్ కేంద్రంలో ఉచిత వైద్య పరీక్షల శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. పుట్టుకతో నే కలిగే అంగ వైకల్యాలు(గ్రహణ మొర్రి, అంగలి చిలికా, వంకర పాదము, అతికిన వేళ్లు), అగ్ని ప్రమాదాలు లేదా యాక్సిడెంట్ వలన కలిగిన వైకల్యాలకు ఉచితంగా పరీక్షించి అవసరమైన శస్త్ర చికిత్స నిర్వహిస్తారని వివరించారు. ఈ సదవకాశాన్ని 0 నుంచి 18 ఏళ్లలోపు వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### కేంద్ర ప్రభుత్వమే నిధులు కేటాయించాలి

ఆదిలాబాద్: కేంద్ర ప్రభుత్వమే పూర్తి నిధులను కేటాయించి ఆదిలాబాద్– ఆర్మూర్ రైల్వే లైన్ మంజూరు చేయాలని రైల్వే సాధన కమిటీ చైర్మన్ కాసవేని నారాయణ యాదవ్ అన్నారు. రైల్వే లైన్ నిర్మించాలని కోరుతూ సాధన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారం 24వ రోజుకు చేరుకున్నాయి. ఆదిలాబాద్ జిల్లా ప్రజల జీవన ప్రమాణాలు అత్యంత దారుణమైన పరిస్థితుల్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మెరుగైన రవాణా సదుపాయాలు కల్పిస్తే ఉద్యోగ, ఉపాధి రంగాలు పెరిగి జీవన ప్రమాణాలు మెరుగవుతాయన్నారు. ఈ దిశగా జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన ఈ రైల్వే లైన్ నిర్మాణం పూర్తి చేయాలని కోరారు.

### రేషన్ బియ్యం పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని ఆదిలాబాద్‌రూరల్ పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. ఎస్సై ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసు స్టేషన్ పరిధిలోని గాయత్రి గార్డెన్ సమీపంలోని ఓ గార్డెన్‌లో ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ వ్యాపారి 116 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచాడు. గోడౌన్‌పై దాడి చేసి నిల్వ ఉన్న బియ్యాన్ని స్వాధీనం చేసుకొని సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు.

## బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యేలు

గురువారం నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తొలిరోజు సమావేశాలకు హాజరయ్యారు.





# 'పునరావాసం' త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- నాసిరకంగా నిర్మిస్తున్నారని లబ్ధిదారుల నిరసన

కడెం: కవ్వాల్ టైగర్ జోన్ కోర్ ఏరియాలోని రాంపూర్, మైసంపేట్ గ్రామాలను తరలించేందుకు కొత్తమద్దిపడగలో పునరావాస పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. పనులను స్వయంగా ఆయన గురువారం పరిశీలించారు. నిర్మించిన ఇళ్లను, సీసీ రోడ్లు, డ్రెయినేజీలను పరిశీలించారు. అనంతరం విద్యుత్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. టా యిలెట్ల నిర్మాణంలో నాణ్యత లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులను మందలించా రు. పునరావాస నిబంధనల మేరకు 94 ఇళ్లు నిర్మించామని అధికాకెలె తెలిపారు. గ్రామస్తులకు విజ్ఞప్తి మేరకు పాఠశాలలను ఇక్కడకి తరలించాలని ఐటీడీఏ అధికారులను ఆదేశించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఉపయోగించుకుంటున్న స్థలంలో పునరావాస కాలనీ ఏర్పాటు చేశారని, తమకు ధాన్యం కొనుగోలు కేంద్రాని స్థలం కే టాయించాలని కొత్త మద్దిపడగ గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. సమీక్షలో డీఎఫ్‌వో రాంకిషన్, డీఆర్డీవో విజయలక్ష్మి, పీఆర్ ఈఈ శంకరయ్య, జెడ్పీ సీఈవో సుధీర్‌బాబు, తహసీల్దార్ సు జాత, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏడీఈ శ్రీనివాస్, ఎఫ్‌డీవో భవాని శంకర్, ఏఈఈ సుమన్, ఎఫ్ఆర్వో అనిత, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కలెక్టర్‌ను అడ్డుకున్న గ్రామస్తులు**

పనులు పరిశీలించి తిరిగి వెళ్తున్న కలెక్టర్‌ను రాంపూర్, మైసంపేట్ గ్రామస్తులు అడ్డుకున్నారు. వాహనం ఎదుట బైఠాయించారు. టాయిలెట్స్, నీటి సరాఫరా, ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించలేదని ఆరోపించారు. గతంలో ఉన్న కలెక్టర్లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, నాణ్యత కూడిన అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తేనే గ్రామలను ఖాళీ చేస్తామని తెలిపారు. లేదంటే ఇక్కడికి వచ్చేది లేదని స్పష్టం చేశారు. దీంతో పోలీసులు ఆందోళనకారులకు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించడంతో కలెక్టర్ వెళ్లిపోయారు.

**ఇంజినీరింగ్ పనులు సకాలంలో పూర్తి చేయాలి**

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకు మంజూరైన ఇంజినీరింగ్ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ట్రైబల్, జాతీయ రహదారులు, పరిశ్రమల శాఖల అధికారులను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల ఇంజినీరింగ్ ఈఈ, డీఈలతో సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా పనుల పురోగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంజూరైన పనులన్నీ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, ఆర్అండ్‌బీ అధికారి అశోక్, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# బోథ్‌కు వచ్చిన ట్రెయినీ ఎఫ్‌ఎస్‌వోలు

బోథ్: హైదరాబాద్ దూళపల్లిలోని ఫారెస్టు ట్రెనింగ్ అకాడామీకి చెందిన 15 మంది ట్రేయినీ ఎఫ్ఎస్‌వోలు శిక్షణలో భాగంగా గురువారం బోథ్ ఫారెస్టు కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా అధికారుల విధులు, కేసుల నమోదు వంటి అంశాలను తెలుసుకున్నారు. పొచ్చెర జలపాతం వద్ద గల నర్సరీని పరిశీలించారు. ఎఫ్ఆర్ఓ ప్రణయ్ వారికి పలు అంశాలను వివరించారు.


ఫారెస్టు కార్యాలయంలో ఎఫ్ఎస్‌వోలు

# 'కొలావర్‌గా చెలామణిని ఖండిస్తున్నాం'

- కొలాం సేవా సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి కొడప నగేష్

ఆదిలాబాద్‌రూరల్: మన్నేవార్లు ఎస్టీ కొలావర్‌గా చెలామణి కావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కొలాం సేవా సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి కొడప నగేష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాత అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్నేవార్లు కొలావర్‌గా చెలామణి కావడాన్ని ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఎస్టీ ఆదిమ కొలాం గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను పూర్తిస్థాయిలో ఐటీడీఏ అధికారులు ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డు సౌకర్యం, నీటి వసతి లేని కొలాం గిరిజన గ్రామాల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో కుమ్రం సూరు యువసేన జిల్లా అధ్యక్షుడు కుమ్ర రాజు, కొలాం సేవా సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కొడప సోనేరావు, ప్రధాన కార్యదర్శి టేకం లక్ష్మణ్, ఉట్నూర్ మండల అధ్యక్షుడు కొడప బాపూరావు, ఇంద్రవెల్లి మండల అధ్యక్షుడు భీంరావు, కోర్ కమిటీ సభ్యులు గోవింద్‌రావు, టేకం వినాయక్ రావు, ఆత్రం బాలెరావు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కొడప నగేష్

# విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- ఫ్లెక్సీ కడుతుండగా ఘటన

నిర్మల్‌రూరల్: టెన్నిస్ కోర్టు ప్రారంభోత్సవానికి సంబంధించిన ఫ్లెక్సీ కడుతుండగా విద్యుత్‌షాక్ తగిలి ఓ యువకుడు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్‌కు చెందిన పెద్ద కొండ పవన్(23), పందెన సాయిరాం, రేగుంట సాయితేజ బుధవారం రాత్రి కొండాపూర్ గ్రామ శివారులో టెన్నిస్ కోర్టు ప్రారంభోత్సవానికి సంబంధించిన ఫ్లెక్సీని కడుతున్నారు. పక్కనే ఉన్న విద్యుత్ హైటెన్షన్ వైర్లను తాకడంతో పవన్ అక్కడికక్కడే మృతి చెందగా సాయిరాం, సాయితేజకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సాయిరాం పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు రూరల్ ఎస్సై తెలిపారు.


పవన్ (ఫైల్)

### ద్విచక్ర వాహనం చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసు స్టేషన్ పరిధిలోని మణిపూర్ కాలనీలో ఇంటి ఎదుట పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనం మంగళవారం రాత్రి చోరీకి గురైనట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. మణిపూర్ కాలనీకి చెందిన నల్ల కోటేశ్వర్‌రావు తన ఇంటి ముందు బైక్‌ను పార్కింగ్ చేసి నిద్రపోయాడు. ఉదయం లేచిచూసే సరికి కనిపించకుండా పోయింది. గురువారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

### మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య

నర్సాపూర్(జి): ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కుస్లీ గ్రామానికి చెందిన కల్లూరు భూమన్న (42) కొంతకాలంగా మద్యానికి బానిసై కూలి పనులకు వెళ్లడం మానేశాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చి దూలానికి తాడుతో ఉరేసుకున్నాడు. మృతుని భార్య కల్లూరు దమ్మవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### చికిత్స పొందుతూ ఒకరు మృతి

సారంగపూర్: ఈ నెల 1న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి తెలిపారు. మండలంలోని ఇప్పచెలిమ గ్రామానికి చెందిన మడావి మారుతి (35) కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. ఈ నెల 1న మొక్కజొన్న పంటకు నీళ్లు పెట్టడానికి వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చేనువద్దకు వెళ్లి చూడగా పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో పడిఉన్నాడు. నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# రూ.9 వేలకు రూ.7 వేలు జమ

- పెంబి ఎస్‌బీఐలో సంఘటన
- బ్యాంక్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసిన ఖాతాదారుడు

పెంబి: ఖాతాదారుడు బ్యాంకులో రూ.9వేలు జమ చేయగా రూ.7వేలు మాత్రమే జమ అయిన సంఘటన మండలంలోని ఎస్‌బీఐలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పెంబితాండకు చెందిన పవన్ సంతోష్‌కు పెంబి ఎస్‌బీఐలో ఖాతా ఉంది. గతేడాది డిసెంబర్6న రూ.9 వేల నగదు డిపాజిట్ చేశాడు. రెండు రోజుల తర్వాత రూ.7వేల నగదు జమ అయినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. బాధితుడు మరుసటి రోజున బ్యాంక్ మేనేజర్‌ను కలువగా ఫీల్డ్ ఆఫీసర్‌ను కలవమని సూచించాడు. అతన్ని కలవగా రూ.2వేలు మీ పర్సనల్ లోన్ అకౌంట్‌లో జమ అయ్యాయని తెలిపాడు. లోన్ అకౌంట్ స్టేట్‌మెంట్ తీయగా ఎలాంటి నగదు జమ కాలేదు. దీనిపై ఉన్నతాధికారులను ఫోన్‌లో సంప్రదించగా.. బ్యాంక్ మేనేజర్ వద్దకు వెళ్లి ఫోన్‌లో మాట్లాడించమన్నారు. దీనిపై పెంబి బ్యాంక్ మేనేజర్ వద్దకు వెళ్లగా రూ.2 వేలు ఆఫీస్ సబార్డినేట్ రాజు ఇస్తాడని చెప్పాడు. దీంతో నగదు తీసుకోకుండా కారకులపై చర్యలు తీసుకోవాలని గురువారం బ్యాంక్ మేనేజర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. దీనిపై 'సాక్షి' బ్యాంక్ మేనేజర్‌ని ఫోన్ ద్వారా సంప్రదించగా నగదు క్యాష్ కౌంటర్‌లో ఇవ్వాలని, అలా కాకుండా ఫీల్డ్ ఆఫీసర్‌కి ఇచ్చారన్నారు. పర్సనల్ లోన్ ఉండటంతో ఇలా జరగవచ్చని దీనిపై త్వరలో విచారణ చేపడతామని సమాధానం ఇచ్చారు.


ఫిర్యాదు పత్రంతో పవన్ సంతోష్

## డివైడర్ కాదు రోడ్డే ...



ఈ చిత్రాన్ని చూస్తే మధ్యలో డివైడర్‌ను నిర్మించి రోడ్డును మరిచారేంటని అనుకుంటే పొరపాటే. భీంపూర్ మండలం పిప్పల్‌కోటి నుంచి తాంసి-కే గ్రామానికి వెళ్లే తారురోడ్డు దుస్థితి ఇది. రోడ్డుకు ఇరువైపులా తారు పూర్తిగా లేచిపోయి కంకర తేలింది. గుంతలుపడి నడిచేందుకు కూడా వీల్లేకుండా మారి మధ్యలో మాత్రమే తారు నిలిచి ఇలా కనిపిస్తోంది. ఐదు కిలోమీటర్ల ప్రయాణమే గంటల తరబడి చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్